

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
సిద్దిపేట
బుధవారం 13 నవంబరు 2024

నిరసన గళం



విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారిపై దాడిని నిరసిస్తూ మంగళవారం జిల్లావ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఘటనకు నిరసనగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పలు ఉద్యోగ సంఘాల నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వార్త 8లో..

కన్నపేగు కోసం కష్టాలు..





రెక్కాలొచ్చాక తల్లిదండ్రులను వదిలేసే కొడుకులు ఉన్న ఈ సమాజంలో ఈ దృశ్యం కనువిప్పు లాంటిది. సిద్దిపేట శరబేశ్వరాలయం వద్ద ఎల్లవ్వ అనే వృద్ధురాలు, ఆమె కొడుకు గాంధీ నివసిస్తుంటారు. గాంధీ అనారోగ్య కారణాల వల్ల నడవలేడు. కొడుకును ట్రై సైకిల్‌పై కూర్చోపెట్టుకుని భిక్షాటన చేస్తూ అతనికి భోజనం పెడుతుంది. ముదిమి వయసులో కూడా.. కదలేని స్థితిలో ఉన్న తన కొడుకు కడుపు నింపడానికి ఆతల్లి నానా కష్టాలు పడుతుంది.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆంధ్రజ్యోతి

రైతులకు అనుకూలంగా ఉండే

రహదారిని గుర్తించాలి

- అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- ఎంపీ రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్ నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏ రహదారి రైతులకు అనుకూలంగా ఉంటుందో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నేషనల్ హైవే అధికారులతో కలిసి ప్రతిపాదిత సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారి 365బీ తో ప్రభావితమవుతున్న సిద్దిపేట సమీపంలోని మర్పడగ, పరిసర ఏడు గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ డీపీఆర్‌ను తయారు చేసిన ఏజెన్సీ ప్రతినిధి మురళి ప్రొజెక్టర్ ద్వారా దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు ప్రతిపాదిత రహదారి మ్యాప్‌ను ప్రదర్శించారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. దుద్దెడ నుంచి రామంచ వరకు గ్రామాల మీదుగా వెళ్తున్న ప్రతిపాదిత రోడ్డు పై రైతులు అభ్యంతర వ్యక్తం చేస్తున్నందున 3 ప్రత్యామ్నాయ రహదారులను ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు.

- దుద్దెల నుంచి రాజీవ్ రహదారి మీదుగా సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తూ 756 డీజీ కలవవచ్చని ఎంపీ సూచించారు.
- రాజీవ్ రహదారి కంటే ముందే వెలికట్ట నుంచి బందారం మీదుగా సిద్దిపేట రీజనల్ రింగ్ రోడ్డు మీదుగా రామంచ వరకు మరో ప్రతిపాదనగా సూచించారు.
- దుద్దెడ నుంచి తుక్కాపూర్, ఘన్పూర్ మీదుగా ఇర్కోడ్ వరకు అక్కడ నుంచి 756 రహదారితో కలిసి రామంచ వరకు ప్రతిపాదిస్తున్నామని వీటిలో ఏది రైతులకు అనుకూలంగా ఉంటుందో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణ సంబంధిత గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమమే మేలు

- సాంకేతికతతో పశుసంపద వృద్ధి
- లింగ నిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ
- మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి అవకాశం
- సబ్సిడీపై అందజేస్తున్న ప్రభుత్వం
- 90 శాతం కచ్చితత్వం.. పాడి రైతుల హర్షం

7 లో..

రోడ్డు ప్రమాదంలో

కానిస్టేబుల్ మృతి

7



సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

డ్యూటీ నిల్..

జరిమానాలు ఫుల్!

- ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించని పోలీసులు
- ఫొటోలు, జరిమానాలే టార్గెట్
- పలుచోట్ల పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

సిద్దిపేట క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుంది. దీనికి తోడు వాహనాల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ క్రమంలో పట్టణంలో ట్రాఫిక్ జామ్ కూడా అధికమవుతుంది. అయితే, ట్రాఫిక్‌ను నియంత్రిచాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఫొటోలు తీస్తూ జరిమానాలకే పరిమితమవుతున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఫైన్లు వేయడంలో ఉన్న ఆసక్తి ట్రాఫిక్‌ను నియంత్రించడంలో కనిపించడం లేదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలు ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని అంటున్నారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

జిల్లా కేంద్రంలో బ్లాక్ ఆఫీస్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కమాన్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, విక్టరీ టాకీస్ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తా, కాంచీట్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా మూడేళ్ల క్రితం రూ.3.50 కోట్లతో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్నిరోజుల వరకు సిగ్నల్స్ బాగానే పనిచేశాయి. అప్పటివరకు ట్రాఫిక్ నియంత్రణలోనే ఉంది. కానీ కొద్ది రోజులకు సిగ్నల్స్ పాడైపోయాయి. తర్వాత వాటికి మరమ్మతులు చేయించినా పనిచేయడం లేదు. కొన్ని చౌరస్తాలలో కనీసం ట్రాఫిక్ పోలీసు కూడా ఉండకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.



సిద్దిపేటలో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు



సుభాష్ రోడ్డులో వాహనాల రాకపోకలతో కిక్కిరిసిపోయిన రహదారి

సుభాష్ రోడ్‌లో వాహనదారులకు ఇబ్బంది

సిద్దిపేట జిల్లా కేంద్రంలో సుభాష్ రోడ్డులో ప్రతిరోజు వాహనదారులతో రోడ్డు కిక్కిరిసిపోతుంది. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డులో ఉన్న షాపులకు ఎదురుగా కొందరు తోపుడు బండ్లపై పండ్లు విక్రయిస్తుంటారు. ఆయా దుకాణాలకు వచ్చే కస్టమర్లు వాహనాలపై రోడ్డుపై నిలుపుతుంటారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యపై దుకాణయజమానులు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఈ సమస్య అలాగే కొనసాగుతుంది. ఇక ప్రత్యేక రోజులు, పండుగ సమయాల్లో కనీసం నడవడానికి కూడా వీలులేకుండా ట్రాఫిక్‌జామ్ అవుతుంది. అలాగే, జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్డు మాంగళ్య షాపింగ్, రైతుబజార్, మెడికేర్ ఆసుపత్రి వద్ద ప్రతిరోజు విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది శివాజీనగర్‌లోని ఆస్పత్రి ఏరియాలో వైద్యం కోసం వచ్చే వారి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఆయా ఏరియాల్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు దృష్టి ఫైన్‌ల పైనే!

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాపిక్‌ను నియంత్రించడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కేవలం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన

మిగతా 8వ పేజీలో...

వైభవంగా

సత్యనారాయణస్వామి వ్రతం

- తరలివచ్చిన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు
- సిద్దిపేట, కరీంనగర్ కలెక్టర్లు హాజరు
- ప్రజలు సుఖశాంతులతో జీవించాలని వ్రతం
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

హుస్నాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు రమా సత్యనారాయణస్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నియోజకవర్గంలోని మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. సిద్దిపేట, కరీంనగర్ కలెక్టర్లు మిక్కిలినేని మనుచౌదరి, పమేలా సత్పతి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా ఏకాదశి పర్వదినాన నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని వ్రతాన్ని నోచినట్లు తెలిపారు. రాబోయేకాలంలో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా పాడి పంటలతో ఉండాలని సత్యనారాయణస్వామిని వేడుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఆర్డీవో రామ్మూర్తి, నాయకులు బంక చందు, చిత్తారి పద్మ, చిత్తారి శ్రీనివాస్, అక్కు శ్రీనివాస్, వల్లపు రాజు, సరోజన తదితరులున్నారు.

కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభించిన మంత్రి

హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రోబోటిక్ ల్యాబ్‌లో సెన్సార్‌లతో తయారు చేసిన పరికరాలను పరిశీలించారు. ఇంగ్లిష్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు లాంగ్వేజ్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతున్నాయన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ఆడిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుకుపోవాలని సూచించారు. భవిష్యత్‌లో మీకు కావాల్సిన అన్ని అంశాలు, అవసరాలు తీర్చే బాధ్యత తమదన్నారు. ఆయన వెంట కలెక్టర్ మనుచౌదరి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో మనీల, హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, తదితరులు ఉన్నారు.



సిద్దిపేట, కరీంనగర్ కలెక్టర్లు మనుచౌదరి, పమేలా సత్పతితో మంత్రి పొన్నం ప్రభాకర్



పాలకమండలి నియామకంపై

వీడని సందిగ్ధం

- మరికొన్ని రోజుల్లో మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చేర్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి నియామకంపై ఇంకా సందిగ్ధం వీడలేదు. రెగ్యులర్ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం దేవాదాయశాఖ ద్వారా సుమారు 6 నెలలక్రితం నోటిఫికేషన్ జారీ చేయడంతో అధికసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటెలిజెన్స్‌వర్గాల ద్వారా దరఖాస్తుదారుల నేరచరిత, ఇతరత్రా వివరాలను సేకరించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నప్పటికీ ఎలాంటి కదలిక లేకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ మొదలైంది. చైర్మన్ కుర్చీపై కన్నేసిన పలువురు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో ఆశావహుల సంఖ్య కూడా భారీగానే ఉంది. ప్రధానంగా రెడ్డి, గొల్ల, కురుమల మధ్య తీవ్రంగా పోటీ నెలకొన్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ మల్లన్న కల్యాణానికి హాజరవడంతో గొల్ల, కురుమలకే చైర్మన్ పదవి కట్టబెడుతూ వచ్చారు. ఆ తర్వాత నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాల దృష్ట్యా రెండు దఫాలు రెడ్డిలకు ప్రాధాన్యం కల్పించారు. పదేళ్లలో గొల్ల, కురుమలకే ఎక్కువసార్లు అవకాశమిచ్చారు. గతేడాది డిసెంబరులో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ రెగ్యులర్ కమిటీ నియమించే అవకాశం లేకపోవడంతో పునరుద్ధరణ కమిటీని నియమిస్తూ రెడ్డి సామాజికవర్గానికి చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఏప్రిల్‌లో గడువు పూర్తవడంతో రెగ్యులర్ కమిటీ నియామకానికి కసరత్తు చేపట్టగా 80 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్‌లోని గొల్ల, కురుమ, రెడ్డి సామాజికవర్గాల నేతలు ఎవరికి వారుగా మద్దతు కూడబెట్టుకుని అధిష్ఠానాన్ని పట్టుబడుతున్నారు. జనగామ పక్క నియోజకవర్గం, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కురుమ సామాజికవర్గానికి చెందడంతో ఆ సంఘం నేతలు ఆయన సహకారంతో చైర్మన్ పదవికోసం సీఎంను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, అతడి తండ్రి అంజన్ కుమార్ హైదరాబాద్‌కు చెందిన తమ అనుయాయులకు చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. మల్లన్నను ఇలవేల్పుగా కొలుస్తున్న దేవాదాయశాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖపై పలువురు సిద్దిపేట, హైదరాబాదు, మెదక్‌కు చెందిన నేతలు తమకు అవకాశం కల్పించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు రెడ్డి సామాజికవర్గనేతలే కావడం, నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధి అనుయాయులకే చైర్మన్ కట్టబెట్టాలని పావులుకదుపుతుండటంతో ఆయావర్గాల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొంది.

ఈసారీ ఉత్సవ కమిటీయే దిక్కా!?

డిసెంబరు 29న మల్లన్న కల్యాణం జరగనుంది. రాజకీయక్రీనీడ నేపథ్యంలో రెగ్యులర్ కమిటీ నియామకంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో కురుమ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు చైర్మన్ పదవి ఖరారు చేసినప్పటికీ నోటిఫికేషన్ విడుదల అనంతరం దరఖాస్తు చేసుకోని కారణంతో పాటు రాజకీయ స్థితిగతుల దృష్ట్యా ఉత్సవ కమిటీయే నియమిస్తే ఎలాంటి తలనొప్పి ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో మీమాంసలో పడిపోయారు. రెగ్యులర్ కమిటీని నియమిస్తారా లేదా ఉత్సవ కమిటీకి పరిమితం చేస్తారా.. ఒకవేళ ఏ కమిటీ వేసినా చైర్మన్ పదవిని ఎవరికి కట్టబెడతారన్నది తెలియక ఆశావహులు నైరాశ్యానికి లోనవుతున్నారు. రెడ్డి సామాజికవర్గీయుడైన సీఎం రేవంత్ మల్లన్న ఆలయ చైర్మన్ ఏ సామాజికవర్గానికి చైర్మన్ కుర్చీ అప్పగించనున్నారన్నది ఆసక్తిని కలిగిస్తున్నది.

బూరుగుపల్లిలో చిరుత కలకలం

- పరిశీలించిన ఫారెస్టు అధికారులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటఅర్బన్ మండలం బూరుగుపల్లిలో మంగళవారం చిరుతపులులు సంచరించాయన్న వార్త కలకలం రేపింది. పలువురు రైతులు వారం, పది రోజులు క్రితం తమకు చిరుత పులితో పాటు, రెండు పులిపిల్లలు కనిపించాయని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి ఫారెస్ట్ అధికారులు వాటి కోసం వెతికినా జాడ దొరకలేదు. మంగళవారం రాత్రి పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతులకు చిరుత పులులు కనిపించడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు హుటాహుటీన గ్రామానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో పులులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పులుల సంచారానికి సంబంధించి తమకు ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని అధికారులు తెలిపారు. హైనా కానీ మరి ఏ ఇతర అడవి జంతువునైనా చూసి, పులి అనుకుని ఉండొచ్చని చెప్పారు. రాత్రి కావడంతో జంతువుల వేలిముద్రలు, మరే ఇతర ఆధారాలు కనిపించలేదని, మరోసారి బుధవారం ఉదయం తనిఖీలు చేపడుతామని తెలిపారు. కాగా ముందు జాగ్రత్తగా అక్కడ బోన్లను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ ఆఫీసర్ పద్మ తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో గుంపులుగా వెళ్లాలని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

సాయిబాబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

మాసాయిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయం 9వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అంతకుముందు విఠలేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్న కమిటీ సభ్యులను, నాయకులను అభినందించారు. కాగా మూడురోజుల క్రితం కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నానమ్మ మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం మాసాయిపేటలో రాజిరెడ్డి ఇంటికెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.


ఆవుల రాజిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

● రాష్ట్ర అకాడమిక్ పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి


పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటస్వామి

వెల్దుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలకు సమయం దగ్గర పడుతుందని, విద్యార్థులు సిద్ధం కావాలని రాష్ట్ర అకాడమిక్ పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి సూచించారు. మంగళవారం వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గరలో ఉన్నదని, ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే ప్రతీ అంశాన్ని శ్రద్ధగా వినాలని, ఉపాధ్యాయులు బోధించే అంశంలో ఏదైనా సమస్య ఉన్నా, అర్థం కాకపోయినా వెంటనే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు ప్రయోజనం

● మెదక్ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు


రంజోల్‌లో మాట్లాడుతున్న మెదక్ డీఈవో వెంకటేశ్వర్లు

జహీరాబాద్, నవంబరు 12: పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంజోల్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో రీడ్ టూ రూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు జ్ఞాన బాండాగారాలని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతీ పుస్తకాన్ని చదువుకోవాలని, అందుకోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. పాఠశాలల్లో ఏర్పాటుచేసిన రీడ్‌టూరూంలు విద్యార్థులకు ఉపయోగకరంగా మారనున్నాయని పేర్కొన్నారు. రీడ్‌టూ రూంలలో అందుబాటులో ఉంచే వివిధరకాల పుస్తకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బస్వరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జోనల్ క్రీడల ఇన్‌చార్జి భీమయ్య

నారాయణఖేడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 10వ జోనల్ 2024-25 స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా 6వ చార్మినర్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. జోన్ పరిధిలోని 11 గురుకులాల బాలురు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను సాంఘీక సంక్షేమ గురుకులాల రాష్ట్ర అధికారి, జోనల్ క్రీడల ఇన్‌చార్జి భీమయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. భోజన, బస, వసతులు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనవెంట క్రీడల జోనల్ సమన్వయకర్త లాలు, 11 గురుకులాల ప్రిన్సిపల్స్, పీడీలు, పీఈటీలు ఉన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా

సంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా సంగారెడ్డిలోని ఐబీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాయిబాషాను పట్టణ యువత సన్మానించారు.

వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● జోగిపేట సీఐ అనిల్‌కుమార్

పుల్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై తాడ్దానిపల్లి చౌరస్తా, సుల్తాన్‌పూర్ గ్రామాల వద్ద జాతీయ రహదారిని జిగ్‌జాగ్‌గా మార్చారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆయా ప్రాంతాల్లో డ్రమ్ములకు ఎల్లో స్టిక్కర్లను అతికించడమే కాకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజా దాటాగానే వాహనాలు వేగంగా వెళ్తుండగా తరచూ ఆయా ప్రాంతాల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. జోగిపేట సర్కిల్ పరిధిలో 161 జాతీయ రహదారి విస్తరించడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రమాదాల జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జాతీయ సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య



వెంకట నర్సయ్య

అక్కన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా జంగపల్లి వెంకటనర్సయ్య నియామకమయ్యారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ తరఫున ఆడే జట్టుకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

రోయింగ్ పోటీల్లో జశ్వంత్‌కు సిల్వర్ మెడల్



జశ్వంత్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేటకు చెందిన కాముని జశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ నెల 5 నుంచి 11 వరకు కేరళ రాష్ట్రం అలెప్పీలో పోటీలు నిర్వహించారు. జశ్వంత్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు.

16 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ అల్లి నరేష్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆహ్వానించినట్లు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు.



కృత్రిమమే మేలు

సాంకేతికతతో పశుసంపద వృద్ధి

- లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పాడికి కృత్రిమ గర్భధారణ
- మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి అవకాశం
- సబ్సిడీపై అందజేస్తున్న ప్రభుత్వం
- 90 శాతం కచ్చితత్వం.. పాడి రైతుల హర్షం

సిద్దిపేట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం కోసం పాలఉత్పత్తిపై దృష్టిసారిస్తున్నారు. ఒకప్పుడు గేదెలు, ఆవులకు ఆడ దూడనే పుట్టాలనే కోరుకునేవారే తప్పా ఏదనేది వారి చేతుల్లో ఉండేదికాదు. కానీ ఇప్పుడున్న సాంకేతికతతో అది సాధ్యమవుతున్నది. ఆవులు, గేదెలకు లింగ నిర్ధారిత వీర్యం(సెక్స్ సార్టెడ్ సిమన్)తో కృత్రిమ గర్భధారణ చేయించి మేలుజాతి దూడల పునరుత్పత్తి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, గోపాలమిత్ర కేంద్రాల్లో ఈ విధానం అందుబాటులోకి వచ్చింది.

90 శాతం కచ్చితత్వం..

ఎదకు వచ్చిన పశువుకు కృత్రిమ గర్భధారణ



పాడి పశువుకు కృత్రిమ గర్భాధారణ పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చేయిస్తే 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడ దూడలు పుట్టే అవకాశం ఉన్నది. అమెరికా వ్యవసాయ శాఖ మొదటగా కనుగొన్న ఈ సాంకేతికతను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సబ్సిడీపై అందిస్తూ పాడి రైతులకు మేలు చేస్తున్నది. లింగ నిర్ధారిత వీర్య స్ట్రాలు(నాళికలు) పశు వైద్య కేంద్రాల్లో మైనస్ 196 డిగ్రీల సెల్సియస్‌లో భద్రపరుస్తారు. సరైన సమయంలో పాడి గేదెలు, ఆవులను పశువైద్యులకు వద్దకు తీసుకెళ్తే చెవిపోగు నంబరు, ఇతర వివరాలు నమోదు చేసుకుని లింగ నిర్ధారిత వీర్యం నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయిస్తారు. వినియోగించిన నాళికలను రైతులకే అందజేస్తారు. అవసరమైనపుడు నాళికలపై ఉన్న నంబర్ సహాయంతో ఈ గోపాల యాప్‌లో పరిశీలించుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ అనంతరం 90 రోజులకు గర్భ నిర్ధారణ పరీక్ష చేయించాల్సి ఉంటుంది. దూడపుట్టిన 15 రోజులలోపు పశువైద్యులకు వివరాలు అందించాలి.

సబ్సిడీపై నాళికలు..

ఒక లింగ నిర్ధారిత వీర్య నాళిక విలువ రూ.675 కాగా, ప్రభుత్వం రూ.425 సబ్సిడీ ఇస్తున్నది. అంటే రైతులు కేవలం రూ.250 చెల్లిస్తే సరిపోతుంది. కృత్రిమ గర్భధారణ చేయించినా పశువు గర్భం దాల్చకపోతే మరోసారి చేయించాలి. రెండు సార్లూ గర్భం దాల్చడం విఫలమైతే. రైతు చెల్లించిన రూ.500లను తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ తిరిగి చెల్లిస్తుంది.

పాడి రైతులకు మంచి సదావకాశం..



చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ శాతం పాడి ఆవులు, గేదెలను పోషించుకుంటారు. మేలు జాతి దూడలే పుట్టేందుకు ప్రభుత్వం వీర్యం స్ట్రాలతో కృత్రిమ గర్భధారణ చేయడంతో రైతులు ఎంతో ఉపయోగం. అదీకూడా సబ్సిడీపై అందించడం చాలా సంతోషం.

-మారెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాడి రైతు, ఇర్కోడు

అన్నీ పశు వైద్య కేంద్రాల్లో..



జిల్లాలోని అన్నీ పశు వైద్య కేంద్రాల్లో లింగ నిర్ధారణ వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని ఆరోగ్య వంతమైన పశువుల్లో సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుంది. ఇది పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మంచి అవకాశం. పూర్తి వివరాలకు దగ్గరలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి.

-డాక్టర్ ఏ.వెంకట్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, సిద్దిపేట

జిల్లా కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో స్టెనో, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ నెల 13 నుంచి డిసెంబర్ 7వ వరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్టులో, లేదా కొరియర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లేదా సంగారెడ్డి.డికోర్ట్స్‌గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో వివిరాలను పొందవచ్చునని పేర్కొన్నారు.

మలేషియాలో మట్టి కళా ప్రదర్శన



మలేషియాలో కళా ప్రదర్శనను వీక్షిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

- హాజరైన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మిరుదొడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మైటా మలేషియాలో జరిగిన కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన అంగడి భాస్కర్ టీం పాల్గొన్న విషయం తెలిసిందే. మంగళవారం మలేషియా ప్రభుత్వం దీపావళి ఉత్సవాలను నిర్వహించింది. ఈ సందర్భంగా డప్పు కళాకారుడు భాస్కర్ బృందం మట్టి కళారూపం ప్రదర్శనను డప్పు దరువులతో నిర్వహించింది. ఈ ప్రదర్శనను రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత భాస్కర్ వీక్షించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మట్టి కళాకారులకు అవకాశాలు కల్పించడం పట్ల మలేషియా ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వియత్నాంకు విస్తరించిన ‘గీతం’ అధ్యాపకుడి సేవలు

- వియెన్ డాంగ్ కళాశాలలో ఆతిథ్య ఉపన్యాసాలు



డాక్టర్ నిరంజన్ అప్పస్వామి

పటాన్‌చెరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంతవరకు పరిశోధనలు చేపట్టడానికి విదేశాలకు వెళ్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఇప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని విదేశీ విద్యార్థులతో కూడా పంచుకుంటున్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి కృత్రిమ మేధా(ఏఐ)పై ఈ నెల 10 నుంచి 24 వరకు ఆతిథ్య ఉపన్యాసాలు ఇవ్వడానికి వియత్నాం హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలకు బయలుదేరి వెళ్లారు. అధ్యాపక వృత్తిలో 25 ఏళ్ల బోధనానుభవం గడించిన నిరంజన్ నవంబరు 2022, 2023 రెండు విద్యా సంవత్సరాల్లోనూ రెండువారాల పాటు వియెన్ డాంగ్ కళాశాల విద్యార్థులకు జావా, ఫ్లట్టర్‌లో ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. విద్యాపరమైన సహకారాన్ని పెంపొందించడం, మెరుగుపరచడంలో ఆయన నిబద్ధత, నైపుణ్యాలు వియత్నాం విద్యార్థులపై ప్రభావం చూపాయి. సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీని కలిగి ఉన్న ఆయన 21 పాఠ్య పుస్తకాలను రచించారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : ముత్తంగి మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల కళాశాలలో అండర్-19 జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మెదక్ ఆర్సీవో గౌతమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిచారు. 16 పాఠశాలలకు చెందిన 525 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నవనీత, పలు కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 12 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సూరారం, జిడిమెట్ల ప్రాంతానికి చెందిన బుస్స లింగం రెండు వాహనాల్లో మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద మంగళవారం ఓ రైస్‌మిల్లుకు చెందిన శివ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు చేసి వాహనాల్లో తరలిస్తున్న 80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైకు.. ఒకరి మృతి

తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తూప్రాన్ పోలీసులు తెలిపారు. బోరబండలోని న్యూరామారావునగర్‌కు చెందిన జిల్లెల్ల రాజేల్లు (41) తూప్రాన్ పట్టణానికి బైక్‌పై వస్తుండగా, హైవే బైపాస్‌లోని పాత నలంద కళాశాల వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



నవీన్(ఫైల్)

చిన్నకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లోని రాజీవ్‌రహదారిపై జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ కథనం ప్రకారం దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన పెంబర్తి నవీన్(38) కోహెడ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్(రైటర్)గా పనిచేస్తూ సిద్దిపేట పట్టణంలో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి నవీన్ కోహెడ నుంచి కారులో సిద్దిపేటకు వస్తుండగా ఇబ్రహీంనగర్ గ్రామం వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి సిద్దిపేట వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో నవీన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్య ప్రసూతి వార్డులో.. భర్త శవం మార్చురీలో..

- కూతురును చూసి వెళ్తుండగా, డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



విజయ్ యాదవ్ (ఫైల్)

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి)12: ఒకే ఆస్పత్రిలో భార్య డెలివరీ అయి ఉండగా.. మార్చురీలో భర్త మృతదేహాన్ని భద్రపర్చిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన మజ్జితి విజయ్ యాదవ్(30), మౌనిక దంపతులకు ఇప్పటికే ఒక కూతురు ఉంది. సోమవారం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరో పాపకు మౌనిక జన్మనిచ్చింది. దీంతో మంగళవారం విజయ్ తన స్నేహితుడితో కలిసి ఆసుపత్రిలోని తన కూతురుని చూసి తిరిగి బైకుపై బయలుదేరాడు. మనోహరాబాద్ మండలం దండుపల్లి 44వ జాతీయ రహదారిపై వస్తుండగా డీసీఎం ఢీకొట్టడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా,స్నేహితుడు ప్రేమ్‌కూమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా క్రిస్టియన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ద యాదయ్య(54) బతుకుదెరువు కోసం గజ్వేల్ పట్టణంలోని లక్ష్మిప్రసన్నకాలనీలో నివాసముంటూ పాత సామాను వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం చేపల వేటకు వెళ్లిన ఆయన రాత్రి అయినా తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం పట్టణ పరిసర ప్రాంతంలో వెతుకుతుండగా సంగాపూర్ సమీపంలోని కదుల్ల కుంటపై ద్విచక్రవాహనం కనిపించింది. కుంటలో వెతకగా యాదయ్య మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

గంజాయి విక్రేతల అరెస్టు

- 300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం..
- ఒకరు హత్య కేసులో నిందితుడు, మరొకరు బీటెక్ విద్యార్థి
- వివరాలు వెల్లడించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న నలుగురి పట్టుకొని, ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు తూప్రాన్ పట్టణానికి చెందిన నీలం అజయ్ (21), సామగారి లోకేష్ (18), మామిండ్ల తరుణ్ (20), అమిత్ సింగ్ (25) పట్టణ శివారులోని లక్ష్మీనర్సింహ వెంచర్‌లో ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు మంగళవారం దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 300 గ్రాములు ఎండు గంజాయితోపాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకో ట్రోఫిక్ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు. గంజాయి కేసులో నిందితులుగా ఉన్న నీలం అజయ్ గతంలో 2022లో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా మరో నిందితుడు లోకేష్ ప్రస్తుతం బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు వారు వివరించారు.

తవ్వుతున్నారు.. అమ్ముతున్నారు..

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- జోరుగా అక్రమ తవ్వకాలు



జూమ్లానాయక్ తండా పరిధిలో గుట్ట నుంచి మట్టి తవ్వకాలు

కోహెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలో మట్టి మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. అధికారుల అండతో గత ఆరు నెలల నుంచి బరితెగించి ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. అనుమతులు లేకున్నా నిబంధనలు మట్టిలో తొక్కి గుట్టలను చెరబడుతున్నారు. కళ్లెదుటే ప్రకృతి సంపద అంతరించిపోతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు గట్టున నిలబడి కళ్లప్పగించి చూస్తున్నారు. తవ్వుకుంటాం, అమ్ముకుంటాం చాతనైతే ఏమైనా చేసుకోండి అంటూ సవాల్ విసురుతున్నారు. కోహెడ మండలం ధర్మసాగర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జూమ్లానాయక్ తండా సమీపంలో గుట్టల మట్టిని వారం రోజులుగా నిత్యం వందల లారీల్లో తరలిస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖ పరిధిలో ఈ గుట్టలు ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిళ్లలో మట్టిని కాజేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. పోలీసు శాఖకు ఫిర్యాదు చేస్తే అది తమ పని కాదని, రెవెన్యూ ఫిర్యాదు చేస్తే సిబ్బంది లేరని, మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేస్తే తమకు చాలా పనులు ఉన్నాయని తప్పించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మూడు శాఖల మధ్య సమన్వయ లేకపోవడం మట్టి మాఫియాకు వరంగా మారింది. అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ లక్షలు సంపాదిస్తున్నారు. దీంతో మున్ముందు పర్యావరణ సమతుల్యత కనుమరుగవుతుందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటలకు దూరం

- అలకారప్రాయంగా క్రీడాప్రాంగణాలు
- వసతులకు నోచుకోని ఆట స్థలాలు
- అందుబాటులోకి తెస్తే ఉపయోగం

కుకునూరుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువతను క్రీడల వైపు మళ్లించేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించి కిట్లను అందజేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొన్ని క్రీడా ప్రాంగణాల్లో వసతులు లేకపోవడం మరికొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు కిలోమీటర్ల దూరాన ఉన్నాయి.



గ్రామానికి రెండుకిలోమీటర్ల దూరాన ఉన్న చిన్నకిష్టాపూర్ క్రీడాప్రాంగణం

ఊరికి దూరంగా

మండలంలోని చిన్నకిష్టాపూర్, ముద్దాపూర్, లకుడారంతోపాటు మరో రెండు గ్రామాలకు కేటాయించిన క్రీడా ప్రాంగణాలు గ్రామాల నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో యువకులు, క్రీడాకారులు అటు వైపు వెళ్లిన దాఖలాలు లేవు. చిన్నకిష్టాపూర్‌కి కేటాయించిన క్రీడాప్రాంగణం కొండపోచమ్మకు వెళ్లే దారిలో గ్రామం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో, అదేవిధంగా ముద్దాపూర్‌లో ఉన్న క్రీడా ప్రాంగణం కూడా గ్రామానికి అంతే దూరంలో ఉంది. ఇక లకుడారానికి కేటాయించిన క్రీడాప్రాంగణం గురించి చెప్పనక్కర్లేదు. ఇది రాజీవ్ రహదారికి పక్కన అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్నది. ముళ్లపొదలు, బండరాళ్లు, చెట్ల మధ్య క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో ఇప్పటివరకు ఈ క్రీడాప్రాంగణాల్లో యువకులు ఆటలు ఆడిన దాఖలాలు లేవు.

అలకారప్రాయంగా..

మిగతా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడ వసతులు లేకపోవడం, ఉన్నా ఇరుకుగా ఉండడం, చాలా గ్రామాల్లో క్రీడాప్రాంగణాలకు స్థలం ఎక్కడా లేకపోవడంతో పాఠశాలలోనే ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల వాలీబాల్, క్రికెట్, ఇతర క్రీడలు ఆడడానికి సౌకర్యాలు గాని, వసతులు గాని లేవు. ఏ ఒక్క క్రీడాప్రాంగణంలో కూడా వసతులు కనిపించడంలేదు. వీటిని అలంకారప్రాయంగా మాత్రమే ఏర్పాటు చేశారని చెప్పవచ్చు. మరికొన్ని సంవత్సరాలు ఇలాగే వదిలేస్తే క్రీడా ప్రాంగణం ఎక్కడ ఉందో కూడా తెలియని దుస్థితి దాపురించే పరిస్థితి. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించి గ్రామాలకు దగ్గరలో ఏర్పాటు చేస్తే గ్రామాల నుంచి ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వసతులు కల్పిస్తాం

క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తాం. గతంలోనే క్రీడలకు సంబంధించిన కిట్లను అందజేశాం. రెవెన్యూ శాఖ అధికారుల సూచన మేరకు క్రీడా ప్రాంగణాలు గ్రామాల్లో ఏర్పాటు చేశాం.

- వెంకటేశ్వర్లు ఎంపీడీవో, కొండపాక

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



మృతుడు

కోహెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్‌లో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఎస్‌ఐ అభిలాష్ తెలిపిన ప్రకారం.. బస్వాపూర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న బావిలో సుమారు 40 ఏళ్లు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందాడా? లేక ఎవరైన హత్య చేసి చెరువులో పడేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేట క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భారత్‌నగర్ పుట్టపర్తి సాయి బాబా ఆలయం దగ్గర చిట్టి రెడ్డి రాజిరెడ్డి అనే వ్యక్తి 9 క్వింటాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచి పెట్టినారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేటలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 10 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 10 మందికి రూ.18000 జరిమానా విధించారు.

గ్రూప్-3 పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు

- అదనపు డీసీపీ మల్లారెడ్డి



సమీక్షా సమావేశంలో అదనపు డీసీపీ మల్లారెడ్డి, అధికారులు

సిద్దిపేట క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 18న సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రూప్ -3 పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట వన్‌టౌన్, టూ టౌన్, 3 టౌన్, అధికారులతో కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూట్ అధికారులు, సెక్షన్ అధికారులను వేరువేరుగా కేటాయిస్తామన్నారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రూప్-3 పరీక్షలు సిద్దిపేట పట్టణంలో 37 కేంద్రాల్లో రెండు రోజులపాటు జరుగుతాయన్నారు.

గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ

గజ్వేల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ పురుషోత్తంరెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్లు సైదా, ముత్యం రాజు, ఎస్‌ఐలు యాదవరెడ్డి, శంకర్, గజ్వేల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- అక్బర్‌పేట-భూంపల్లి మండల విద్యాధికారి అంజయ్య



వంటగదిని పరిశీలిస్తున్న ఎంఈవో

మిరుదొడ్డి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల విద్యాధికారి అంజయ్య సూచించారు. మండలంలోని ఖాజీపూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఆలయంలో అవినీతిపై విచారణ చేపట్టాలి

- బీజేపీ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం కొమురవెల్లి గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు మాట్లాడుతూ.. మల్లన్న ఆలయంలో ఈవో బాలాజీశర్మ నాలుగేళ్లుగా ప్రతీ ఒక్కరిని మభ్యపెడుతూ అభివృద్ధి కాంట్రాక్టు పనుల్లో కమీషన్లు అందిపుచ్చుకుంటున్నారని ఆరోపించారు. క్యూ కాంప్లెక్స్ భవనంతో పాటు 50గదుల సత్రభవనం యేళ్లతరబడిగా నాణ్య ప్రమాణాలు లేకుండా కొనసాగుతున్నా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఆలయభూములు ఆక్రమణకు గురవుతున్నా వత్తాసుపలుకుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై దేవాదాయ శాఖ కమిషనర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, కుడికుడి మల్లేశం, నర్ర మహేందర్‌రెడ్డి, కుర్రారం బాలనర్సయ్య, గుర్రాల రాములు, దండ్యాల భిక్షపతిరెడ్డి, పుట్ట కనకయ్య, సానాది కరుణాకర్ జనగామ తిరుపతి, ఈగ కనకయ్య, బచ్చల రాజు, ఆకుల పాండు, చల్లా రమణారెడ్డి, కొంతం రాజు తదితరులు ఉన్నారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'



గజ్వేల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

గజ్వేల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలో జాలిగామ రోడ్‌లోని వాసవి కాటన్ ఇండస్ట్రీస్, శివగంగ కాటన్ ఇండస్ట్రీ సీసీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నక్క రాములుగౌడ్, సుభాష్‌చంద్రబోస్, గంగిశెట్టి రాజు, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, అజ్గర్, సురేష్, వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- జగదేవ్‌పూర్: మండలంలోని అలిరాజ్‌పేట విశ్వతేజ పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో నేటి వరకు ఆరు సీసీఐ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏవో వసంతరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, రమేష్, బ్రహ్మచారి, కరుణాకర్, రాము, మహేందర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం రాయితీపై చేప పిల్లల పంపిణీ: డీఎఫ్‌వో పరదారెడ్డి

కోహెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం వందశాతం రాయితీపై చేపపిల్లలను పంపిణీ చేస్తున్నదని జిల్లా మత్స్యశాఖ అధికారి పరదారెడ్డి అన్నారు. మండలంలోని సింగరాయ ప్రాజెక్టులో ఉచిత చేప పిల్లల పంపిణీని మంగళవారం నిర్వహించారు. మత్స్య కార్మికులతో కలిసి ఆయన ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేప పిల్లలను పెంచి తద్వారా ఉపాధి పొందాలన్నారు. అనంతరం వరదారెడ్డిని మత్స్యకారులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుతారి కనకయ్య, ప్రాజెక్టు కార్యదర్శి కొత్తూరు యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పరుశురాములు, గుండారెడ్డిపల్లి, తంగళ్లపల్లి గ్రామాల మత్స్యకారులు, డైరెక్టర్లు ఉన్నారు.

'చేనేత వస్త్రాలను కొనుగోలు చేద్దాం'

సిద్దిపేట టౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ సూచించారు. తన నూతన ఇంటి నిర్మాణం పూరైన తరుణంలో ఇంటికి వచ్చే అతిథులకు సన్మానం చేసేందుకు సుమారు 1500 తువాలలతో పాటు చీరలను సిద్దిపేట పట్టణంలోని చేనేత కార్మికుల వద్ద కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం

కుకునూరుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ గెలుపొందేలా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దారం గురువారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు హాజరయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో గౌరవరం కృష్ణ, తుడుం నాగజ్యోతి, సదానందం, కూరెళ్ల నాగేంద్రం, నాగరాజు, నందకిషోర్‌శర్మ, శ్రీను, రమేష్, నవీన్, చందు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ



సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

మర్కుక్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ అన్నారు. మండలంలోని యూసఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయ అని ఎన్యూమరేటర్లను, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కోడింగ్ వల్ల సమయం ఆలస్యం అవుతుందని, హడావిడిగా కాకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తి అయ్యి ఆన్‌లైన్ చేసే వరకు పూర్తి బాధ్యత ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లదేనని మండల ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఆరిఫా, ఎంపీడీవో అబ్దులుద్దీన్‌లకు సూచించారు. ఆమెవెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేబోరా రాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఎన్యూమరేటర్ నాయక్ తదితరులు ఉన్నారు.

'కులగణనపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు'

దౌల్తాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణనపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బండారు లాలు అన్నారు. మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రజల సమక్షంలో మాట ఇచ్చినట్టుగానే సీఎం బీసీ కులగణన చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, నాయకులు అంజత్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారతస్థాయి మల్లఖంబ పోటీలకు విద్యారణ్య ఆవాస విద్యాలయ విద్యార్థులు



భరద్వాజ్



చైతన్య

సిద్దిపేట అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం తడకపల్లిలో 9వ తరగతి విద్యార్థి అన్నోజు భరద్వాజ్, ఆరో తరగతి చెక్కల చైతన్య అనే విద్యార్థులు అఖిల భారతస్థాయి మల్లఖంబ పోటీలకు ఎంపికైనట్లు సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులను అభినందించిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో మొదటి బహుమతి సాధించాలని ఆకాంక్షించారు.

'యువత రాజకీయాల్లోకి రావాలి'

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని యువతకు, ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత రాజకీయాలలోకి రావాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

చిన్నకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఓటు వేయడం యువత బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సివిక్స్ అధ్యాపకుడు నరసింహచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకట కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కార్యాలయాన్ని తరలించొద్దు

- ఎంపీ రఘునందన్‌రావుకు నాయకుల వినతి

సిద్దిపేట అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఈపీఎఫ్ కార్యాలయాన్ని తరలించొద్దని హెచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. ఈపీఎఫ్ కార్యాలయంలో రెండు లక్షలకు పైగా కార్మికులు ఖాతాదారులుగా ఉన్నారని, కార్యాలయాన్ని తరలించినట్లయితే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి లక్ష్మణ్, స్వామి, రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి: శ్రీనివాస్

బెజ్జంకి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ కోరారు. మండలంలోని గుండారంలో మంగళవారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం, సంపత్, కొమరయ్య వెంకటేశం తదితరులున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేటటౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో మున్సిపల్ నుంచి అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో పట్టణాభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న యజమానులు అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఉదయాన్నే పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకోగానే వెంటనే వార్డులలో పర్యటించాలని, ఎక్కడైనా పారిశుధ్య పరమైన సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మంచినీటి నల్లాలకు మోటార్లు బిగించినట్లయితే చర్యలు తప్పవన్నారు. పన్ను వసూళ్లలో సిద్దిపేటను ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలని, వ్యాపారస్తులు సైతం ట్రేడ్ లైసెన్స్ తీసుకుని వ్యాపారాలను నిర్వహించాలన్నారు.

శోభాయమానం కార్తీకం



కార్తీకమాస దీపోత్సవ వేడుకల్లో భాగంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో భక్తులు ఆలయవర్గాలతో కలిసి దీపాలను వెలిగించారు.

- చేర్యాల

ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు అమానుషం

- టీఎన్‌జీవో నాయకులు, ఉద్యోగులు

సిద్దిపేట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు అమానుషమని టీఎన్‌జీవో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి మండిపడ్డారు. సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పెద్ద ఎత్తున ఉద్యోగులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలోని బొమ్మరసిపేట్ మండలం లాగ్‌చెర్లలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, నగేష్, ఉపేందర్, సుమన్, సాయి, మనోహర్, చైతన్య, కాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు: ఉద్యోగులపై దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న తహసీల్ కార్యాలయ ఉద్యోగులు

- గజ్వేల్: కలెక్టర్, అధికారులపై దాడి హేయమైన చర్య అని టీఎన్జీవో గజ్వేల్ ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. అధికారులపై దాడిని నిరసిస్తూ గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కలెక్టర్‌కే రక్షణ లేకపోతే ఉద్యోగుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ శ్రవన్‌కుమార్ , డీఏవో, టీఎన్జీవో గజ్వేల్ తాలూకా అధ్యక్షులు లింగం, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, భరత్, బిలాల్, శ్రవన్, కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- కోహెడ: వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడిని ఖండిస్తూ కోహెడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ సురేఖ, హుస్నాబాద్ ట్రెస అధ్యక్షుడు భుడిది ఎల్లయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ రాములు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.
- మద్దూరు: కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ టీఆర్ఈఎస్ఏ పిలుపు మేరకు మద్దూరు మండల కేంద్రంలోని రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



సిద్దిపేట కలెక్టరేట్: అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు


- సిద్దిపేట కలెక్టరేట్: వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడిని ఖండిస్తూ సిద్దిపేట జిల్లా అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు పొన్నమళ్ళ యాదగిరి, కనకరాజు, కపిల్‌రెడ్డి, నాగరాజు, అరుణాకర్, బిక్షపతి, రాంచెంద్రం, చెట్లపల్లి రాజు, అభిలాష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
- చేర్యాల: వికారాబాద్ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ చేర్యాల తహసీల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దారు సమీర్ అహ్మద్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్యూటీ నిల్.. జరిమానాలు ఫుల్!

5వ పేజీ తరువాయి..

వాహనాల ఫొటోలు తీసి జరిమానాలు వేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకత తనిఖీలు చేపట్టి జరిమానా ఉన్న వాహనదారులను పట్టుకుని జరిమానాలను కట్టించుకుంటున్నారు. జరిమానా కట్టని వాహనలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఇక, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 5,502 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రాజీవ్‌రహదారిపై వేగంగా వెళ్లిన వాహనాలపై 92,589 కేసులు నమోదయ్యాయి. స్పీడ్‌లేజర్ గన్ ద్వారా గుర్తించి ఈ కేసులు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలో ఉల్లంఘిస్తేనే జరిమానాలు



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగిస్తేనే జరిమానాలు విధిస్తాం. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలి. జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరలోనే తీరుస్తాం. వారం రోజులకు ఒకసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించి, వారికి అవగాహన కల్పిస్తాం. రాంగ్ రూట్లో వెళ్లే వాహనదారులకు భారీ జరిమానా విధిస్తాం. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం. అలాగే, రాజీవ్ రహదారిపై అతివేగంగా వెళ్లే వాహనాలకు స్పీడ్ గన్ ద్వారా జరిమానాలు విధిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే వాహనదారులకు జరిమానాలు.

- సుమన్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ